వెల్లువెత్తిన ఓటరు చైతన్యం

- పరిఢవిల్లిన ప్రజాస్వామ్యం
- పోలింగ్ కేంద్రాలకు భారీగా మహిళలు, యువత, వృద్ధులు
- ఈవీఎంల మొరాయింపుతో పలుచోట్ల పోలింగ్ ఆలస్యం
- ఎండను లెక్క చేయకుండా బారులు తీరిన ఓటర్లు
- నియోజకవర్గంలో 78.46 శాతం పోలింగ్


నిడదవోలు 27వ నంబర్ బూత్‌లో ఓటు వేసిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు


నిడదవోలు 34వ బూత్‌లో ఈవీఎం మొరాయింపుతో మహిళా ఓటర్ల ఇక్కట్లు

నిడదవోలు: ఓటర్లలో చైతన్యం వెల్లి విరిసింది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే భావన పౌరుల్లో కనిపించింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. ఈవీఎంలు మొరాయించినా తమ వంతు వచ్చే వరకూ ఓపికగా గంటల తరబడి క్యూలో నిలబడి పవిత్ర కార్యాన్ని దిగ్విజయంగా నెరవేర్చారు. చెదురుమదురు ఘటనలు మినహా నిడదవోలు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలు మొరాయించడంతో పలు కేంద్రాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పలు కేంద్రాలకు సాయంత్రం వేళ పెద్ద ఎత్తున ఓటర్లు తరలి రావడంతో పోలింగ్ బాగా ఆలస్యమైంది. నియోజవకర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వాటిలో 30 శాతం ఈవీఎంలు మొరాయించాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు 27వ బూత్‌లోని ఈవీఎంలు కూడా కొద్దిసేపు పనిచేయక పోవడంతో పోలింగ్ అరగంట ఆలస్యమైంది. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని 34వ నంబర్ బూత్‌లో ఈవీఎంలు గంటసేపు పని చేయలేదు. దాంతో మండుటెండలో బారులు తీరిన ఓటర్లు ఇబ్బంది పడ్డారు. సెక్టార్ అధికారులు ఈవీఎంలను మార్చడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి వరకు ఓటర్లు పోటెత్తారు. ఒక పక్క మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు, వృద్ధులు, యువత ఓటు వేసేందుకు ఉరకలెత్తిన ఉత్సాహంతో బారులు తీరారు. ప్రతి కేంద్రంలోను ఆలస్యం కావడంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ప్రతి కేంద్రానికీ మహిళా ఓటర్లు అధికంగా తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని 27వ బూత్‌లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు, కుమారుడు వరుణ్‌సాయిలు ఓటు వేశారు.

అంతంత మాత్రంగా ఏర్పాట్లు


నిడదవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల బూత్‌లో ఈవీఎంను మారుస్తున్న టెక్నికల్ సిబ్బంది

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు అంతంత మాత్రమే అని చెప్పవచ్చు. అనేక పోలింగ్ కేంద్రాల వద్ద పీఎస్ నంబర్లు కూడా ఓటర్లకు సక్రమంగా కనిపించని పరిస్థితి. కొన్నిచోట్ల లైటింగ్ సక్రమంగా లేకపోవడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు అభ్యంతరం తెలిపారు. ట్యాబ్ లైట్లు ఏర్పాటు చేయ్యాలని అధికారులను కోరారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.దేవసహాయం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

పోలింగ్ శాతం ఇలా....

నియోజకవర్గంలో మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉన్నారు. రాత్రి తొమ్మిది గంటలకు అందిన సమాచారం ప్రకారం వాటిలో 1,67,439 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 78.46 శాతంగా నమోదైంది. ఉదయం 9 గంటలకు 22.23 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా, రాత్రి 7 గంటలకు అది 65 శాతానికి పెరిగింది. పట్టణంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం గేట్లను సాయంత్రం ఆరు గంటలకు మూసేశారు. అప్పటికే 150 మంది ఓటర్లు లోపల ఉండడంతో రాత్రి కూడా పోలింగ్ నిర్వహించారు. స్థానిక బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు సుమారు 70 మంది ఓటర్లు ఉండిపోవడంతో రాత్రి 8 గంటల వరకూ వారు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. గ్రామాల్లో మధ్యాహ్నం వేళ కూడా ఓటర్లు బారులు తీరి కనిపించారు. వంటలు, భోజనాలు ముగించుకున్న తర్వాత మహిళలు ఓటింగ్‌కు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

రాత్రి 10 గంటల వరకూ పోలింగ్

- ఈవీఎంల మొరాయింపుతో మొదట్లో అంతరాయం
- పలుచోట్ల ఆలస్యంగా ప్రారంభం
- రాత్రి తొమ్మిది గంటలకు 81.34 శాతం పోలింగ్ నమోదు
- కొవ్వూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో మరింత పెరిగే అవకాశం


కొవ్వూరు అచ్చాయమ్మ కాలనీలో ఓటు వేసిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

నియోజకవర్గంలో పోలింగ్ శాతం ఇలా

సమయం	ఓటర్లు	శాతం
9 గంటలకు	14,566	7.74
11గంటలకు	42,531	23.10
1 గంటకి	62,986	34.21
3 గంటలకు	99,295	53.92
5 గంటలకు	1,33,905	72.72
9 గంటలకు	1,49,782	81.34


కొవ్వూరులో 69వ బూత్‌లో ఓటు వేసిన మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులు

కొవ్వూరు: నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రాత్రి పది గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. రాత్రి 9 గంటలకు అందిన సమాచారం ప్రకారం 81.34 శాతం పోలింగ్ పూర్తయ్యింది. ఈవీఎంల మొరాయింపుతో పలుచోట్ల ఉదయం పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. స్థానిక మునిసిపల్ హైస్కూల్లోని 74వ నంబర్ పోలింగ్ కేంద్రంలోను, ప్రభుత్వ కళాశాలలోని 92వ నంబర్ కేంద్రంలోను ఈవీఎంలు మొరాయించాయి. మరోపక్క ఉదయం ఏడు గంటలకే ఏ పోలింగ్ బూత్ వద్ద చూసినా భారీ ఎత్తున ఓటర్లు క్యూలో వేచి ఉన్నారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కొన్నిచోట్ల మాక్ పోలింగ్ ఆలస్యం కావడంతో పోలింగ్ జాప్యానికి కారణమైంది. నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు, ఆయన సతీమణి పరంజ్యోతి స్థానిక అచ్చాయమ్మ కాలనీలోని ఎంపీయూపీ స్కూల్లో ఏర్పాటు చేసిన 84వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఆయన కుటుంబ సభ్యులు అదే స్కూల్లోని 83వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులు పట్టణంలోని 69వ నంబర్ పీఎస్‌లోను, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ మునిసిపల్ హైస్కూల్లోనూ ఓటు వేశారు. సాయంత్రం ఆరు గంటలు అయ్యాక క్యూలో ఉన్న ఓటర్లందరికీ నంబర్ స్లిప్పులు అందజేసి ఓటు హక్కు కల్పించారు. రాత్రి పది గంటలకూ కూడా అనేక పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతోంది.

రాత్రి తొమ్మిది గంటలకు అందిన సమాచారం మేరకు 81.34 శాతం ఓటింగ్ పూర్తయ్యింది. చివరి బూత్ వివరాలు కూడా అందితే ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో 85.17 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కూడా అదే స్థాయిలో పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రాత్రి పది గంటల తర్వాత దొమ్మేరు, తోగుమ్మి, చిక్కాల, ఔరంగాబాద్, మద్దూరు గ్రామాల్లో పోలింగ్ కొనసాగుతోంది.

ఈవీఎంల పనితీరుపై ఓటర్ల ఆగ్రహం


దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఓటు వేసిన రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత, ఆమె భర్త డాక్టర్ శ్రీనివాస్, కుమార్తె ప్రణవి


దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు

- డెడ్ స్లోగా పని చేసిన యంత్రాలు
- గంటల తరబడి క్యూలో నిరీక్షించిన ఓటర్లు
- ఓటు వేసేందుకు మూడు గంటల సమయం
- దేవరపల్లి 60వ బూత్‌లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్

దేవరపల్లి: ఈవీఎంల పని తీరుపై ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం రెండు గంటల పాటు పలు పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు పనిచేయనందున ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల ఈవీఎంలు డెడ్ స్లోగా పని చేశాయి. దాంతో గంటల తరబడి ఓటర్లు క్యూలో నిరీక్షించారు. వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, ఉక్కపోత వాతావరణం వల్ల పోలింగ్ బూత్‌ల వద్ద పలువురు వృద్ధులు సొమ్మసిల్లారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ బూత్‌కు వెళ్లిన పౌరులు మూడు గంటల పాటు నిరీక్షించాక గాని ఓటు వేసి బయటకు రాలేని పరిస్థితి గోపాలపురం నియోజకవర్గంలోని పలుచోట్ల ఏర్పడింది.


యర్నగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న మంత్రి తానేటి వనిత

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7 గంటల వరకూ కొనసాగింది. దేవరపల్లి 60వ నంబర్ పోలింగ్ బూత్‌లో అయితే రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ జరిగింది. ఇదే పరిస్థితి మరికొన్ని కేంద్రాల్లో కూడా నెలకొంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడం పోలింగ్ ఆలస్యానికి కారణం. ఎండకు జడిసి మధ్యాహ్నం వేళ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకపోవడం, సాయంత్రం 5 గంటల నుంచి ఒక్కసారిగా పోటెత్తడం వంటి కారణాలతో పోలింగ్ ఆలస్యమైంది. సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ కేంద్రం లోపలకు వచ్చిన ఓటర్లను అధికారులు అనుమతించారు. అనంతరం వచ్చిన ఓటర్లను అనుమతించకపోవడంతో వారు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

నియోజకవర్గంలో 70.14 శాతం పోలింగ్

గోపాలపురం నియోజకవర్గంలో పోలింగ్ సరళి ఉదయం 9 గంటలకు 8.72 శాతంగా నమోదైంది. ఉదయం 11 గంటలకు 23.88 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 34.43 శాతం, 3 గంటలకు 56.24 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 70.14 శాతంగా పోలింగ్ శాతం నమోదైంది.

యర్నగూడెంలో ఓటు వేసిన మంత్రి వనిత

రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత, ఆమె భర్త డాక్టర్ తానేటి శ్రీనివాసరావు, కుమార్తె ప్రణవి, మంత్రి తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావులు యర్నగూడెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 88వ నంబర్ పోలింగ్ బూత్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు టీడీపీ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సాయంత్రం ఐదు గంటలకు దేవరపల్లి మండలం స్టాక్ నగర్‌లో ఓటు వేశారు. అనంతరం తానేటి వనిత, ఆమె తండ్రి జొన్నకూటి బాబాజీరావులు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అలాగే బీజేపీ రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కూడా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.మార్టిన్ లూథర్ కూడా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చిన్నాయగూడెంలో టీడీపీ కార్యకర్త దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించగా వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 248 పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ నిర్వహించారు.

మొరాయించిన ఈవీఎంలు


నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఉదయం ఏడింటికే బారులు తీరిన మహిళలు


తెలికిచెర్లలో వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న దివ్యాంగుడు అంబేద్కర్

నల్లజర్ల: మండలంలోని గంటావారిగూడెం- 201, చీపురుగూడెం- 150, ప్రకాశరావుపాలెం- 170, 167, పుల్లలపాడు- 182, దూబచర్ల- 207, ఆవపాడు- 211 నంబర్ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దాంతో ఎన్నికల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉదయం 9 గంటలకు 9.27 శాతం, 11 గంటలకు 23.92 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 55 శాతం, సాయంత్రం 5 గంటలకు 72.32 శాతం ఓటింగ్ నమోదైంది. తెలికిచెర్ల, అనంతపల్లి, ఆవపాడు తదితర గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరి కనిపించారు. రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ జరిగింది. చెదురుమదురు ఘర్షణలు తప్ప మండలంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు.

తాళ్లపూడి మండలంలో..


తాళ్లపూడి మండలం మలకపల్లి పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు

తాళ్లపూడి: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయాన్నే ఈవీఎంలు మొరాయించాయి. దాంతో పలుచోట్ల ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అప్పటికే పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఆలస్యాన్ని భరించలేని కొందరు ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగేశ్వరపురంలోని 25వ నంబర్ పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 7.35 గంటల వరకూ పోలింగ్ మొదలు కాలేదు. ఈ పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు నెమ్మదిగా పనిచేశాయి. తిరుగుడుమెట్టలోని 36వ నంబర్ బూత్‌లోనూ ఈవీఎం మొరాయించింది. పోచవరంలో మెషీన్ నెమ్మదిగా పనిచేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఎండకు ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

75.42 శాతం పోలింగ్

మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి అర గంట పాటు పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పోలింగ్ ఊపందుకుంది. గతంతో పోలిస్తే పోలింగ్ శాతం పెరిగింది. మండలంలో 41873 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం 5 గంటలకు పురుషులు 15,255 మంది, మహిళలు 16,328 ఓటు వేశారు. సాయంత్రం ఐదు గంటలకు 75.42 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. తిరుగుడుమెట్ట, సహా పలు గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు కూడా ఓటింగ్ జరిగింది.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మలకపల్లి, పెద్దేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం, తాళ్లపూడి తదితర గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటింగ్ జరుగుతున్న తీరు గురించి సిబ్బందిని, స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆ పార్టీ నాయకులు కొమ్మిరెడ్డి పరశురామారావు, తోట రామకృష్ణ, ఎల్లిన శివ, గనిశెట్టి బంగార్రాజు, కుంట ముక్కల కేశవనారాయణ, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎం దమయంతి, దుర్గారావు, తదితరులు ఉన్నారు.

పలుచోట్ల పోలింగ్ ప్రశాంతం


చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు

చాగల్లు: మండలంలో ఉదయం పూట, మధ్యాహ్నం వేళ పోలింగ్ మందకొడిగా సాగింది. చాలా చోట్ల పోలింగ్ రాత్రి వరకూ కొనసాగడం విశేషం. మండలంలో 52,441 మంది ఓటర్లు ఉండగా, వారి కోసం 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు 10.49, 11 గంటలకు 24.46, మధ్యాహ్నం 1 గంటకు 39.29, 3 గంటలకు 55.89 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 69 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్రాహ్మణగూడెంలో జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గా శ్రీనివాస్, మార్కొండపాడులో ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంథ్రోతు సురేంద్రకుమార్ ఓటు వేశారు. ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు చంద్రవరం, మార్కొండపాడు, దారవరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల తదితర గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్. రాజీవ్‌కృష్ణ కూడా పోలింగ్ ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. కాగా ఊనగట్లలోని 144, చాగల్లులోని 118 పోలింగ్ కేంద్రాలతో పాటు చిక్కాలలోను ఈవీఎంలు పనిచేయక పోవడంతో పోలింగ్ సుమారు గంట ఆలస్యంగా ప్రారంభమైంది.


చాగల్లులో రాత్రి ఎనిమిది గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


పెరవలి మండలం తీపర్రులో ఓటు వేసేందుకు వచ్చిన మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: స్వల్ప ఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటు వేసేందుకు ఉదయం 7 గంటల నుంచే పౌరులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలో మొత్తం 61,864 మంది ఓటర్లు ఉండగా 58 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో అర గంట సేపు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు వేచి ఉండవలసి వచ్చింది. ఆ తర్వాత పోలింగ్ ఊపందుకుంది. మహిళలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. వృద్ధులు, వికలాంగులను ఆటోల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, పాలంగిలో ఎంపీపీ యల్లారేశ్వరి ఓటు వేశారు.


ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో దివ్యాంగురాలిని ట్రై సైకిల్‌పై ఓటింగ్‌కు తీసుకువెళుతున్న సేవకుడు

నిడదవోలు రూరల్: ఓటు వేసేందుకు ఉదయం ఆరు గంటల నుంచే మండలంలోని వివిధ పోలింగ్ బూత్‌ల వద్ద పౌరులు బారులు తీరారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు మొరాయించడంతో పోలింగ్ కొన్ని చోట్ల ఆలస్యంగా మొదలైంది. కోరుమామిడి, విజ్జేశ్వరం, తాడిమళ్ల, పందలపర్రు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు శాఖ బందోబస్తు నిర్వహించింది. పోలింగ్ సరళిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు డి.ముప్పవరం, కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం గ్రామాల్లో పర్యవేక్షించారు. తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఓటర్లు వచ్చి ఎన్నికల్లో ఉత్సాహంగా ఓటు వేశారు.


సమిశ్రగూడెంలో ఉదయాన్నే పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

పెరవలి మండలంలో..

పెరవలి: స్వల్ప ఘటనలు మినహా మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. మండలంలో 57,705 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 28,563 మంది, మహిళలు 29,142 మంది. ఉదయం 11 గంటలకు 36 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 45 శాతం, మూడు గంటలకు 60 శాతం, సాయంత్రం 5 గంటలకు 77 శాతం పోలింగ్ జరిగింది. కానూరు, ఉసులుమర్రు, పెరవలి, మల్లేశ్వరం, కాపవరం, తీపర్రు గ్రామాల్లో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. దాంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన పౌరులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఖండవల్లి, ముక్కామల, కానూరు, అన్నవరప్పాడు, మల్లేశ్వరం పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇవి పలుమార్లు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి. పోలీసులు సకాలంలో స్పందించి రెండు వర్గాల వారిని చెదర గొట్టి, పరిస్థితిని చక్కదిద్దారు

భూముల సేద్యము కౌలు కొరకు బహిరంగ వేలం ప్రకటన

క్ర.సం.	సర్వే నెం.			భూములు వున్న గ్రామము	వేలం జరుగు ప్రదేశము	వేలం తేది, సమయము
1.	134	4-93	5003	…వల్లి గ్రామం	శ్రీసుబ్రహ్మణ్యేశ్వర & శ్రీచంద్రశేఖర స్వామి దేవస్థానం నందు	24-06-2024 మధ్యాహ్నం 12గం.లకు
2.	348	5-77	5003	…వల్లి గ్రామం		
3.	175	5-42	5003	…వల్లి గ్రామం		
4.	248	3-43	5003	…వల్లి గ్రామం		

ది.14-05-2024 సింగిల్ ట్రస్టీ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com